# వెయ్యి రూపాయల ప్రాణం

**-జె.శ్రీనివాసరావు**

"నువ్వెన్ని చెప్పు. నా దగ్గర చిల్లిగవ్వ కూడా లేదు. నేను నీ కోసం అప్పు కూడా చేయలేను. కాబట్టి నువ్వు ప్రయాణం మానుకోవడమే అన్నివిధాలా మంచిది" ఖరాఖండీగా సుదర్శనం తండ్రితో అన్నాడు. "అలా కాదురా. పెళ్లికి రమ్మని మరీ మరీ మీ అమ్మ పెదనాన్న పదిసార్లు చెప్పాడు. మాట ఇచ్చాక ఇలా అర్థాంతరంగా మానేస్తే ఎలా?" ఇంకా వదలకుండా పెదనాన్న సుదర్శనంతో అనడం విన్పిస్తోంది.

మా నాన్న, సుదర్శనం నాన్న స్వంత అన్నదమ్ములు. మా ఇళ్ళు కూడా పక్కపక్కనే. వాళ్లింట్లో మాటలన్నీ వాకిట్లో పడుకున్న మాకు స్పష్టంగా విన్పిస్తున్నాయి. వేసవి తాపానికి ఇంట్లో పడుకోలేక బయట అన్ని ఇళ్లవాళ్ళం పక్కలేయడం అలవాటు.

సుదర్శనం బ్యాంకులో పని చేస్తున్నాడు. వాళ్ళ ఆవిడ టీచరుగా పని చేస్తోంది. సుదర్శనం అన్న ఏదో ప్రైవేటు కంపెనీలో బొంబాయిలో పనిచేస్తున్నాడు. అతని భార్య అక్కడే గవర్నమెంటు ఆఫీసులో పని చేస్తోంది. చిన్నప్పట్నుంచీ మా పెదనాన్న సుదర్శనాన్ని, వాడి అన్ననీ అల్లారుముద్దుగా పెంచాడు. ప్రభుత్వ ఆఫీసులో సూపరింటెండెంట్‌గా పనిచేసి మా పెదనాన్న రిటైరయ్యాడు. రిటైర్మెంట్ చివరల్లో వున్న డబ్బంతా పెట్టి ఇల్లు కట్టి సుదర్శనంకు ఒక వాటా, పెద్దవాడికి ఒక వాటా ఇచ్చాడు. ఇల్లు కట్టేటప్పుడు డబ్బు చాలకపోతే కొన్ని చిట్‌ఫండ్ కంపెనీలలో చీటీలు పాడి మరీ ఇంటి క్రింద పెట్టాడు. ఇప్పుడు వస్తున్న అతని పెన్షన్‌లో మూడొంతులు ఆ చీటీలకే సరిపోతోంది. డబ్బుకు చాలా ఇబ్బందుల్లో ఉన్నాడు.

ఉన్న కొడుకులు ఇద్దరూ సంసారాలు సాగిస్తూ సంపాదిస్తున్నది వెనకేయడం అలవాటు పడ్డారు. దాంతో పెదనాన్నకు ఏ సమయంలో డబ్బు అవసరం వచ్చినా ఇదిగో ఇలా కొడుకుల్ని ప్రాధేయపడడం, వాళ్ళు ఛీ పొమ్మనడం అలవాటు అయిపోయింది.

"అయినా నాకు తెలీక అడుగుతాను. నువ్వు ఆ పెళ్లికి హైదరాబాద్ వెళ్లి ఏం ఉద్ధరిస్తావట? వెయ్యి రూపాయలంటే నీకు తమాషాగా వుందా? ఆరొందలు పెట్టి చెప్పా పెట్టకుండా అమ్మకు నీకు టిక్కెట్లు రిజర్వు చేస్తే సరిపోతుందుకున్నావా? ఇప్పుడు పీకలమీదకు ఖర్చులకోసం ఎక్కి కూర్చుంటే నేనెక్కడ తేనూ?" సుదర్శనం తండ్రిని దులిపేస్తున్నాడు.

"అదికాదురా. మీ పెళ్ళిళ్లకు మాత్రం అంత దూరం నుండి రాలేదా? అయినా మీ అమ్మకు ఒకసారి జబ్బు చేసినప్పుడు హైదరాబాద్‌లో వాళ్లెంత ఉపకారం చేసారనుకున్నావు? మనం ఇలా ఖర్చు అవుతుందని వాళ్ళు పిలిచినా వెళ్లకపోతే ఏం బావుంటుంది చెప్పు" ఎలాగైనా పెదనాన్న వెయ్యి రూపాయల ఖర్చులకోసం కొడుకుని ప్రాధేయపడుతున్నాడు.

నాకు బాగా గుర్తు. చిన్నప్పుడు సుదర్శనంని పెదనాన్న ఎలా పెంచాడో? ఏనాడూ ఏదీ లోటు రానీయలేదు. సుదర్శనం హైస్కూల్ చదువులోనే ఒకసారి ఆల్ ఇండియా ఎగ్జిబిషన్ కోసం పెదనాన్న పంపాడు. అప్పట్లో దాని ఫీజు అయిదు వేలు. ఆమాటకొస్తే మా ఊళ్ళో నుండి ఆ కేంప్‌కు వెళ్లింది ఒక్క సుదర్శనమే. దానికోసం పెదనాన్న రెండు ఎడ్లను కూడా అమ్మేసాడు. 'వాడు కోరింది ఇవ్వడం తండ్రిగా నా బాధ్యత. అయినా వాడికి డబ్బులు ఇవ్వడంలో నా కష్టాన్ని కూడా ఆనందంగా మర్చిపోతాను' అనేవాడు పెదనాన్న ఎప్పుడూ.

అలాంటి పెదనాన్న ఇప్పుడు కొడుకు దగ్గర వెయ్యి రూపాయలకోసం చేయి చాచి ప్రాధేయపడడం నాకు చాలా బాధేసింది. కుటుంబ గౌరవం కోసం, మంచి మర్యాద పాటించడంకోసం ఆ పెళ్లికి వెళ్లాలని పెదనాన్న అంటాడు. కానీ సుదర్శనానికి అదంతా ఒక పెద్ద దండగ పనిలా కన్పిస్తోంది. కాలం గడుస్తున్నకొద్దీ కుటుంబంలో వున్న బంధాలు, విలువలు ఎంత వేగంగా మారుతాయో అన్నదానికి ఇదొక పెద్ద ఉదాహరణ.

డబ్బుకోసం పెద్ద కొడుక్కి రాసాడట. కానీ 'నేనిప్పుడు పైసా కూడా పంపలేనని' వాడూ రాసాడు. వాడు, వాడి భార్య వాడి సంసారం వాడికి ముఖ్యం అయ్యాయి. రెండు చేతులా సంపాదిస్తున్నా తండ్రి ఆర్థిక అవసరాలకు ఆదుకోవడం సుదర్శనానికి ఒక పెద్ద దండగమారి పనిలా కన్పిస్తోంది. పెదనాన్న పెళ్లికి వెళ్లడమా? మానడమా? పెద్ద సంశయంలో పడిపోయాడు. కేవలం వెయ్యి రూపాయకు అంత క్షోభకు గురయ్యాడు. తన జీవితంలో కొన్ని లక్షల రూపాయలు అవలీలగా ఖర్చు పెట్టి సంసారాన్ని లాక్కొచ్చిన పెదనాన్నకు వెయ్యి రూపాయలు ఒక పెద్ద సమస్యగా అయి కూర్చుంది. కొడుకులు సంపాదనపరులైనాక, భార్యల కొంగులు పట్టుకున్నాక తల్లిదండ్రులు వార్ధక్యంలో చేసిన ప్రతి పని ఆ పిల్లలకు ఒక దండగమారిగానే కన్పిస్తాయి. తమని తండ్రి ఎన్ని కష్టాలు పడి ఏ విధంగా పైకి తీసుకొచ్చాడో కనీసం పదో శాతం అయినా గుర్తు పెట్టుకోని పిల్లలు ఈ కాలంలో ఎందరో ఉన్నారు.

ఇంత జరిగినా పెదనాన్న బాధపడలేదు. డబ్బులు బాగా ఉన్నా ఒక్క వెయ్యి రూపాయలు ఏ కొడుకూ సర్దలేక పోయాడే అని ఆ తండ్రి విచారించడంలేదు ఇప్పటికీ. కుటుంబ గౌరవం కోసం, ఒకనాడు కుటంబానికి సహాయపడ్డవారి ఆహ్వానాన్ని మన్నించడంకోసం వెయ్యి రూపాయలు ఎలా సమకూర్చుకోవాలోనని తాపత్రయ పడుతున్నాడు. ఆ వెయ్యి రూపాయలు దొరక్కపోతే ప్రయాణం మానుకుని అవతలవారిని బాధ పెట్టినవారమవుతామేమోనని బాధ పడుతున్నాడు. డబ్బు ఇంత విలువైనదా అని ఇప్పుడు గుర్తిస్తున్నాడు. అయితే మాత్రం ఏం చేయగలడు?

"బ్యాంకులో మొన్న వేసిన మూడువేల రూపాయల్లోనైనా ఒక్క వెయ్యి ఇవ్వరా?" మళ్ళీ కొడుకుని పెదనాన్న అడిగాడు.

"చూడు నాన్నా. మొన్న బ్యాంకులో వేసిన ఆ మూడువేలు నీకులా దండగ ఖర్చులకోసం కాదు. వచ్చే వారం మావాడిని పెద్ద కాన్వెంట్‌లో జాయిన్ చేయాలి. ఫీజుకోసం ఉంచాను. దాని ఊసే నీకు అనవసరం" చాలా ఖచ్చితంగా సుదర్శనం తండ్రితో చెప్పాడు. ఇంక ఆఖరి అవకాశం కూడా పోయిందని స్తంభానికి చేరబడి జాలిగా పెదనాన్న కూర్చోవడం నాకు కన్పించింది. సుదర్శనం డబ్బులేక కాదు, తండ్రికి ఇవ్వకపోవడం అని నాకు అర్థం అవుతూనే ఉంది. పెదనాన్న అప్పట్లో ఇలాగే సుదర్శనం అడిగిన అనేక ఖర్చులకు ప్రశ్నలు వేస్తే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేదే కాదు. పిల్లల్ని బాగా ఖర్చుచేసి చదివిస్తే బాగా వృద్ధిలోకి

వచ్చి తల్లిదండ్రుల్ని బాగా చూసుకుంటారని అందరూ అనుకుంటారు. కానీ చివరకు జరిగేది మరొకటి. బాగా వృద్ధిలోకి వచ్చాక సంపాదనపై కన్నుపడి సుఖాలకోసం, స్వార్థపూరితంగా పిల్లలు ఈ రోజుల్లో తయారై మిగులుతున్నారు. వార్ధక్యంలో ఉన్న తల్లిదండ్రుల కనీస కోర్కెలు కూడా దండగ పనులుగానే భావిస్తున్నారు.

"మీ పెదనాన్న రేపు మిమ్మల్ని అప్పు అడుగుతారేమో! లేదని ముందే చెప్పేయండి'' నా భార్య పరిస్థితి అంతా గ్రహించి నన్ను ముందే హెచ్చరించింది. నా భార్య అనకపోయినా నా పరిస్థితి అలాగే వుంది. కాకపోతే పెదనాన్నకు ఎవరి దగ్గరైనా ఓ వెయ్యి రూపాయలు అప్పు అయినా ఇప్పిద్దామని మనసు పీకుతోంది. కనీసం పెదనాన్నకు ఈ పరిస్థితుల్లో ఆ మాత్రం అయినా సాయం చేయకపోతే ఎలా? అని నేను ఎంతగానో అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

★★★

అనుకున్నట్లుగానే మర్నాడు పెదనాన్న సమస్యని నా ముందు పెట్టి "ఒరే! నువ్వయినా ఎలాగైనా ఓ వెయ్యి రూపాయలు అప్పు ఇప్పించరా? ఇంకా నేను ఎన్నాళ్ళు బ్రతుకుతాను? మీ పెద్దమ్మ కూడా పెళ్లికి వెళ్లి వాళ్ళకు కృతజ్ఞత చూపాలని కోరుతోంది. చివరిరోజుల్లో అయినా కనీసం దాని కోరికను ఎలా కాదనగలను చెప్పు?'' అన్నాడు పెదనాన్న.

"సర్లే పెదనాన్నా. నా దగ్గర అంటే అంతలేదు. దాసన్నపేటలో తిమ్మరాజని ఓ ఫైనాన్స్ కంపెనీ వాడు ఒకడున్నాడు. నువ్వెళ్తానంటే నేను ఫోన్ చేసి చెప్తాను'' అన్నాను.

"అలాగేరా. పొద్దునే వెళ్తే ఏమనుకుంటాడోగానీ సాయంత్రం ఆరుగంటలకు వెళ్తాను. నువ్వు ముందే ఫోన్ చేసి చెప్పు'' అన్నాడు పెదనాన్న.

ఆఫీసు నుండి తిమ్మరాజుకు ఫోన్‌చేసి చెప్పాను ఇలా మా పెదనాన్న వస్తే వెయ్యి రూపాయలు నా పేర ఖర్చు వ్రాసి ఇమ్మని. 'అలాగే' అని అతనన్నాడు. సాయంత్రం ఆఫీసు నుండి బయటపడేసరికి ఏడయింది. ఇంటికి వచ్చేసరికి వాకిలినిండా జనాలు. పరిస్థితి ఏమీ అర్థంకాక ఆతృతగా సైకిల్‌ను అలాగే జారవిడిచి పరుగెట్టాను.

అంతే! పెద్ద షాక్!

పెదనాన్న చనిపోయాడు. దాసన్నపేట జంక్షన్‌లో ఒక లారీ గుద్దేసింది.

"అసలే ఆరుగంటలకు ఆ జంక్షన్ మహారద్దీ. అసలీయన అటు ఎందుకెళ్లాడు?'' చాలామంది అనుకుంటున్న ప్రశ్న అక్కడ తిరుగుతోంది. కానీ నాకు తెల్సు ఈ సాయంత్రం పెదనాన్న అటు ఎందుకెళ్లాడో? వార్ధక్యం వరకూ కుటుంబ విలువలకోసం, బంధాలకోసం పాటుపడడానికి పెదనాన్న చేసిన ప్రయత్నం విలువ అతని ప్రాణం ఖరీదు! కేవలం ఒక వెయ్యి రూపాయలకోసం అతను పడే తాపత్రయంలో కోల్పోయిన అతని ప్రాణం ఖరీదు వెయ్యి రూపాయలు. కానీ సంఘటనా సందర్భాన్ని ఎవరూ పట్టించుకోలేదు పెద్దగా. తండ్రి దహనానికి అన్ని ఏర్పాట్లు చేసాడు సుదర్శనం. అన్నయ్య, పిల్లలు అయిదు వేలు ఖర్చుపెట్టి ఏసి కోచ్‌లో బొంబాయి నుండి తండ్రి అంత్యక్రియలకు వచ్చాడు తన హోదాకు తగ్గట్టు. సమాజంలో తన విలువకు సరిపడేటట్టు ఘనంగా తండ్రికి అంత్యక్రియలు సుదర్శనం పదివేలు ఖర్చు పెట్టి మరీ చేసాడు. పెదనాన్న బ్రతికుండగా వెయ్యి రూపాయలకు బోలెడు లెక్కలు వేసిన కొడుకులిద్దరూ తండ్రి పోయాక వెనకా ముందూ చూడకుండా వేలకు వేలు ఖర్చు చేసారు. ఎందుకు? సమాజంలో తమ తమ విలువలు, గౌరవాలు కాపాడటం కోసం.

పాపం పెదనాన్న ప్రాణం ఖరీదు మాత్రం ఎప్పటికీ వెయ్యి రూపాయలే!

★

